
# చిరునవ్వు వెల




"మూర్తీ!"

పోలీస్‌స్టేషను దద్దరిల్లింది.

"ఆపు."

ఆగిపోయాడు మూర్తి. మూర్తితో కలిసి ఎక్కడివాళ్ళక్కడ గప్‌చిప్. మూర్తి కుడిచేతిలోని కర్ర ఎడమచేతిలోనికి యెప్పుడు జారుకొనిందో తెలియదు. కర్రతో కలిసి ఎడమచేయి వెనక్కు వెళ్ళింది. కుడిచేయి పైకి లేచింది. లేచినచేయి లేచినట్లుగా 'సెల్యూట్' చేస్తూవుంది. నిలువు రాయిలా స్తంభించిపోయాడు మూర్తి!

డియస్పీ రావు ప్రసన్నవదనుడు. పసిబిడ్డలా నవ్వుతూ నవ్విస్తూ వుంటాడు. కొరకరాని సమస్యలను కూడా పుల్ల విరిచినట్లు విరవడం అతని ప్రత్యేకత. అతని మాటవింటే - 'అబ్బ! రావ్‌గారా! మహామేధావి!' అంటుంటారు. అంతటి సరసుడు సహృదయుడు శివతాండవం చేస్తాడను కోవడం అనూహ్యం! అందుకే పోలీస్ స్టేషన్ దద్దరిల్లింది.

సెంట్రీ అంటే అసలే నిటారుకొమ్మ. ఈ దద్దరింపులో మరింత నిగుడుకొన్నాడు. రావ్‌గారి కారుడ్రైవరు అయ్యగారి కోపానికి అబ్బురపడి అబ్బురపడ్డందుకు నిదర్శనంగా కుడిచేయి చూపుడువ్రేలిని ముక్కుమీదికి తెచ్చి యెవరైనా గమనిస్తే యేం కొంపలు మునుగుతాయో? అని వెంటనే సెల్యూట్‌గా మార్చి రవ్వంత నోరు తెరిచి అటుయిటు కదలకుండా ఆ కారుకే హత్తుకుపోయాడు. ఓ కొమ్మమీద రెక్కలు ముడుచుకొని వరుసగా కూర్చున్న గువ్వల్లా వున్న ఆ స్టేషనులో ఓ స్టాండుకు అందంగా అమర్చిన తుపాకులు సెంట్రి భుజంమీది తుపాకితో కలిపి ఆరున్నొక్కటి క్షణం చలించాయి. ఏ కాలంనాటిదో గోడమీద గడియారం పదిగంటల సమయములో ఆ దెబ్బకు హడలి పన్నెండు కొట్టింది.

"నువ్వు మనిషివా? లేక...." ఆ తరువాతి మాటల్ని కోపమే మింగిందో? లేక ఉత్తరభాగాన్ని ఉచ్ఛరించడానికి మనిషి ఇచ్ఛగించలేదో? ఊగిపోతున్నాడు రావు. అక్కడ డియస్పీ రావు సాక్షాత్తు ప్రత్యక్షమైవున్నా ఆ స్టేషనులో రాజ్యమేలుతున్నది మౌనం. ఆ మౌనాన్ని చీల్చుకొని సన్నని మూలుగు. మూలుగుతో కలిసిన ఏడుపు వినిపిస్తున్నాయి.

ఉడికిన వంకాయలా వడలిన వళ్ళు....ముగ్గుబుట్టలా పండిన చింపిరి తల....నెర్రెలు చీలిన నేలలో ఎండ్రకాయగుంతల్లా కండ్లు....ఎండిన రొమ్ములు....ఎండిన రొమ్ములకు యే మాత్రము ఆశ్రయమివ్వలేక నిట్టూరుస్తున్న చిరిగిన రైక....సగం ఒంటిని కూడా సంరక్షించలేక సతమతమవుతున్న అతుకుల కోక....అరవై యేళ్ళు వుండవు. అయినా పేదరికం

పెంచిన వయసుతో అంతకు పైబడినట్లనిపిస్తూ వుంది. పామును చూసిన కప్పలా ఓ మూల నక్కింది. బెదురు....బెదురుతో కలిసిన వణుకు....ఈ రెండింటికి మించిన భయము....బాధ! ఎగ్గొట్టుక వస్తున్న ఏడుపును బిగబట్టుతూ వుంది. ఆ బిగింపుతో యేడుపు మూలిగినట్లుగా వినిపిస్తూవుంది. అప్పుడప్పుడు ఒంటిమీది దెబ్బలను తడిమిచూస్తూ వుంది. ఎండిపోయిన ఆ కట్టెలో యెక్కడ వుండిందో అంత తడి!—చెంపలమీద కాల్వలు గట్టింది!

"గొడ్డును బాదినట్లు బాదుతున్నావే? ఏం చేసిందా ముసిల్ది?"

డియస్పీ రావు అడుగుతున్నాడు. మూర్తి సమాధానం చెబుతున్నాడు.

"దొంగతనం చేసింది సార్!"

"ఏం దొంగతనం?"

"గుడ్డలు దొంగిలించింది సార్;"

"ఎక్కడ?"

"గాంధీరోడ్లో ప్లాట్‌ఫారం మీద!"

"గాంధీ రోడ్‌లో ప్లాట్‌ఫారం మీదనా?" సందేహంగా అడిగాడు రావు!

"అవును సార్!"

"అంటే!"

"ప్లాట్‌ఫారం మీది పాతగుడ్డల్ని సార్!

"ఛీ!"

"క్షమించండి సార్! ఈ రోజు పాతవి. రేపు కొత్తవి. వీళ్ళనిలా వదిలితే లాభంలేదు సార్!"

"అక్కడికి ఆపు!" గర్జించాడు రావు.

ఆగిపోయాడు మూర్తి. అటుయిటు కదలకుండా నోరు మెదపకుండా ఆగిపోయాడు మూర్తి. చువ్వలా లేచి ఒక్క వూపులో రావుగారి కాళ్ళమీద

గువ్వలా ముడుచుకపోయింది ఆ అవ్వ - గాంధీ పుట్టిన దేశంలో ఆయన పేర వెలసిన ఓ వీధిలో దొంగతనం చేసిన నేరానికి! గాంధీగారికి పేద లంటే అభిమానము. దొంగతనమంటే అసహ్యము. అందుకేనేమో ఎటూ పలకలేకుండా గోడమీద వేలాడుతున్నాడు మహాత్ముడు. ఈ దేశములో ఆయనకు నోరుపడిపోయి చాలాకాలమయింది. ఆయన ప్రక్కన్నే మరి కొందరు మహాత్ములు. దేశాన్ని వుద్ధరించడానికని పుట్టిన మహానాయకులు. ఉద్ధరించి ఉద్ధరించి 'యికచాలు బాబూ!' అనుకొని మహాత్ముని ప్రక్కన చేరి మౌనంగా చూస్తున్నారు—ఉద్ధరింపబడిన దేశంలో ఓ పేదరాలు పాత పేలికల్ని దొంగిలించిన నేరానికి శిక్ష అనుభవిస్తూ వుంటే!—

ఆమెను చూడలేకపోయాడు రావ్. ఆ పోలీస్ ఆఫీసర్ కండ్లల్లో ఎఱ్ఱజీర ఎగ్గొట్టుకరావడానికి మాటువేసింది. 'పాతపేలికలు....దొంగతనము' అంటూ తనలో తాను గొణుక్కుంటున్నాడు. గొణుక్కుంటూ పాదాలమీద పడి వున్న ముసలిదానివైపు చూశాడు. ఒక్క నిట్టూర్పు విడిచాడు. అటు తర్వాత శూన్యంవైపు చూశాడు. చూస్తూ కాసేపు ఆలోచించాడు. ఏమను కొన్నాడో యేమో? ఆమెను రెండు చేతులతో పట్టుకొని పైకి లేపాడు.

కారుకు హత్తుకపోయిన డ్రైవరు కనురెప్పలు అలా అలా అల్లార్చి చూచి, నిజమని తేలేసరికి నిలువు రెప్పలు వేశాడు. మెడ త్రిప్పలేని సెంట్రీ కనులు మాత్రం త్రిప్పి చూచి పోలీసుస్టేషనులో అలాంటి దృశ్యాన్ని భరించలేక మళ్ళీ కనులు త్రిప్పుకున్నాడు. అంతకు మునుపు 'లాకప్'లో వున్నారు కొందరు నేరస్థులు. వాళ్ళు సీనియర్లు. జూనియర్‌కు జరుగుతున్న సత్కారానికి సంబరపడి చేయెత్తి దండం పెడుతున్నారు. దయా దాక్షిణ్యము, నీతి నిజాయితి, యింటి పైకప్పుమీదికెక్కి కూర్చున్నవి. మళ్ళీ ఒకసారి దిగివచ్చి స్టేషనులో సగర్వంగా తలెత్తుక తిరుగుతున్నాయి. మూర్తి మాత్రం తలవంచాడు.

"అవ్వా! నువ్వు దొంగతనం చేశావా?"—అనునయంగా అడిగాడు రావు.

తల వాల్చి చేతులు ముడిచి నిలబడివున్న ఆ ముసలిది చేశానన్నట్లుగా తల ఆడించింది.

"ఎందుకు చేశావ్?"

"బాబూ! నేను దొంగదాన్ని బాబూ! నేను దొంగతనం చేశాను బాబూ! ఈ సేతుల్తోనే దొంగతనం చేశాను బాబూ! ...నరికెయ్యండి బాబూ యీ రెండు సేతుల్ని నరికెయ్యండి:" దీనాతిదీనంగా రోదిస్తూ ఆ ముసలిది కుప్పగ కూలిపోయింది రావ్ పాదాలమీద. ఒక్క అడుగు వెనక్కు జరిగాడు రావు. లేని కాఠిన్యాన్ని తెచ్చుకున్నాడు.

"ఏయ్! అవ్వా పైకి లే!"

కాఠిన్యానికి కరుణకు వ్యత్యాసం తెలిసినట్లుందా ఎండు కంపకు! పైకి లేచింది.

"అడిగినదానికి సమాధానం చెప్పు. చేతులు నరకడమో? తలలు తీయడమో? నిర్ణయించేది నువ్వు కాదు. ఎందుకు దొంగతనం చేశావు?" అడగడంలో పోలీసు అధికారి అనిపించాడు రావు.

ఒక్కసారి దీనంగా అతని ముఖంలోనికి చూసింది అవ్వ. ఆ చూపుల్ని చూడలేక రావు యెటో చూస్తున్నట్లు నటిస్తున్నాడు. అవ్వ ఏడుపును బిగపట్టుకొనింది.

"బాబూ! పుట్టి బుద్దెరిగిన నాట్నుండి యిట్లాంటి పాడుపని యీ సేతుల్తో సెయ్యలేదు బాబూ!" బిగబట్టుకున్న యేడుపు బీగంతీసిన తలుపులాగ తెరచుకొనింది. ఏడుపు....ఎక్కిళ్ళు....ఎక్కిళ్ళు ...యేడువు....ఏది ముందు? ఏది వెనుక? తెలియడం లేదు.

"ఏయ్! ముసిలీ! నిన్నే అడుగుతున్నది. నీకే చెబుతున్నది. ఏడ్చింది చాలు. అడిగినదానికి బదులు యేడుపు?"—రెట్టించాడు రావు.

అక్కడికక్కడిగా వున్న పైట చెరుగును అవస్థపడి ముందుకు లాక్కొనింది అవ్వ. కంట తడిని వత్తుకొనింది. రావు రెట్టింపుతో ఎక్కిళ్లు యెటో పారిపోయాయి.

అవ్వ చెబుతున్నది. రావు వింటున్నాడు.

"యాడ పుట్నానో? యాడ పెరిగినానో? తెలవదు బాబూ! నాకు తెలిసే టప్పటికి పేరూరు బండమీద గుల్లకొడతావుంటి. పొద్దుగూకులు గుల్లకొడితే పావలా అర్ధో శాతపడేది. ఆ బండ కిందనే గుల్ల కొట్టే జనవంతా తలకొక గుడిసేసుకున్నారు. పొద్దుపోతే యేదో ఒక గుడిసెలో తలదాసుకున్నా యేఁవీ అనుకునే వయసుగాదు. అట్లాగే వుండిపొయ్యుంటే యే బాదాలేదు. వచ్చిన రూకను ఎవురికిచ్చినా పిడికెడు మెతుకులు నా మొకానిదిలించే వాళ్ళు. ఏ గుడిసెలోనో అట్లా అడ్డంపడి లేసి నా పని నేను సేసుకుంటా పొయ్యుండే దాన్ని. పాపిష్టి బతుకుల కట్లా యెట్లా జరుగుతుంది బాబూ! బండ మీద బతుకేఁవో యెదగలేదు. కూలి బెరగలేదు. కానీ నాకు తెలవకనే నా ఒళ్ళు పెరిగిపొయ్యింది!"

"అవ్వా! నిన్ను కథ చెప్పమని అడగలేదు. నిన్ను అడిగింది— 'దొంగతనం ఎందుకు చేశావని?'— అడిగినదానికి సమాధానం చెప్పు." రావులో కాఠిన్యం తగ్గినట్లనిపించలేదు.

"ఆ అయ్య నన్ను సితగ్గొట్నాడు. సెర్మం సిట్లేటట్లకొడతా 'ఎందుకు దొంగతనం సేశావో సెప్పు!' అని అడిగినాడు. కిక్కురుమనకుండా దెబ్బలు తిన్నానేకానీ నోరు కదపలేదు. బాబూ! నువ్వు దేముడిలాంటి మణిసివి. నీ దగ్గిర అంతా సెప్పుకోవాలనిపిస్తా వుండాది. నన్ను కొట్టినా కోసినా నేను సెప్పాలనుకొనింది సెప్పాల్సిందే! నువ్వు యినాల్సిందే బాబూ!" ఏడుపు.... మాటలు.... మాటలు.... ఏడుపు.... కలగాపులగంగా కలిసి వెలువడ్డాయి. రావు నిరుత్తరుడై నిలబడిపోయాడు.

అవ్వ చెబుతున్నది.

"బాబూ!! వళ్ళు పెరిగిన వయసులో ఆ బండమింద కండగలిగిన మొగోడొకడు గుల్లకొట్టుకుంటా నా కంటబడినాడు. వాడికంట్లో నేను పడినాను. సూపులు సూపులు కల్సినాయి. వాణ్ణి నేనొల్లినాను. నన్ను వాడొల్లినాడు. వాణ్ణి నమ్ముకుని వాడెంట నేనెల్లినాను. వాడికి కండలుండినాయి కానీ గుండెకాయ లేదుబాబూ! — బండలుగొట్టి బతికేవాడికి గుండెలుంటాయా నా పిచ్చి కానీ! నాక్కడుపొచ్చేసరికి వాడు నాక్కాకుండా కానరాకుండా పొయ్‌నాడు." పాత కథ మనస్సును కోతబెట్టిందేమో?— కాసేపు మాట్లాడలేకపోయింది ముసలిది.

"ఆడ తిరిగినా, ఈడ తిరిగినా, యాడేడో తిరిగినా, కాలుగాలిన పిల్లిలా వూరూరు తిరిగినా, వాడిమింద కలవరం పోలేదు. వాడేఁవో కానరాలేదు. కడకీ తిరపతిలో జోతీ టాకీస్ కెనకాల గెవర్నమెంటోళ్ళ పోరంబోకు నేలలో ఆ అయ్య ఈ అయ్య కాళ్ళుగాదని సేతులు పట్టుకోని అంతో యింతో ఎనకేసింది సెలవుజేసి ఒక్క గుడిసి యెయ్యించుకున్నా! ఆ గుడిసిలోనే నీళ్ళాన్నాను. ఆ గుడిసిలో నే బతకతా ఆ యింట్లో యీ యింట్లో పాసిపనుల్జేసుకుంటా కాలం యెళ్ళదోశాను. ఎందురో కవ్వించినా నవ్వించినా కాలుజారకుండా నా సెవటతోనే నా బిడ్డను పెంచి పెద్దోణ్ణి జేసినా! కడకీ నాటికి నా తలరాత యిట్లా రాసింది బాబూ! దొంగదానిమాదిర ఠేసిన్లో నిలబడాల్సొచ్చింది!"

నీతి నిజాయితిగా బ్రదికిన ముసలిది. నీతి తప్పినందుకేమో నిలువునా క్రుంగిపోతూ వుంది.

"నేనెన్నెన్నో అనుకున్నా. ఏఁవేఁవో కలలుగన్నా. నా బిడ్డను పెద్ద పెద్ద సదువులు సదివించాలనుకున్నా. వాడుద్దోగం చేస్తుంటే సూడాలనుకున్నా. తిరగని కడప పట్టని కాళ్ళు లేవనుకొనిందానికి వాడూ కూలోడే అయినాడు బాబూ!" అనుభవం మనిషిని ఆలోచింపచేస్తుంది!—అన్నది కూడా అనుభవపూర్వకమైన మాట. దీనికి నిదర్శనంగా అమాయకురాలైన

ఆ ముసలి దాని మాటల్లో అనుభవముంది. అనుభవంతో కూడిన ఆలోచన వుంది. ఆ ఆలోచనలో బాధ వుంది. బాధ కథగా వెలువడుతూ వుంది.

"మూడేండ్ల నాగు కొండమీద వాడిసేత మూడుముళ్ళు యెయ్యించినా. కోడల్ని యింటికి దెచ్చుకున్నా. ఇద్దురు ముగ్గురైనారు. ముగ్గురూ కూలీ నాలీ చేసుకుంటున్నాం. కుదురుగ బతుకుతూ అంతో యింతో ఎనకేసు కుంటున్నాం.

వాళ్ళిద్దరు సిలకాగోరింకెల మాదిర కల్సిమెల్సి ఆ గుడిసెలో బతకతా వుంటే వాళ్ళ సుకఁవే నా సుకఁవనుకోని ఆ పంచనా ఈ పంచనా తలదాసు కుంటా వుంటి. ఇంతలో కోడాలికి నెలతప్పింది. నా మనుసు కొండెక్కి కూసునుంది. అటున్నపుల్ల యిటైయ్యనియ్యకుండా ఎనకేసుకుణ్ణిందంతా దానికే పెట్టి రచ్చించుకుణ్నా. మొన్న ముసురుల్లో అది కనింది బాబూ! మొగపిల్లోణ్నే కనింది!"

రావు వింటున్నాడు. వింటూ ఆ ముసలిదాని జీవిత కథనానికి పాత పేలికల దొంగతనానికి పొంతనాలు కుదుర్చుకోలేక వింతగా ఆ ముసలిదాని వైపు చూస్తున్నాడు. మూర్తి వింటున్నాడు. ఈ కథ ఎక్కడ మునిగి ఎక్కడ తేలి తన్ను ముంచుతుందో? అని కుంచించుకపోతున్నాడు.

"బాబూ! నీకు తెలియందేముంది? పదిరోజులుగా పట్టుకున్న ముసురు వదల్లేదుగదా? కుండతో కుమ్మరించినట్లు వాన కురిసినే! మంచి మంచి యిండ్లే ఆ వానకు వురిసినే!—యింక మాలాంటి పేదోళ్ళ గుడిసెల సంగతి సెప్పాలా? తెల్లవాదులూ మేలుకొని వాననీళ్ళు మూకుడుతో ముంచెత్తి పొయ్యిడానికి సరిపొయ్యింది బతుకు. వానట్లా యెలిస్తేసాలు. ఇంటడుగు తడిని పాత గుడ్డలతో పిండి పిండేస్తిఁవి. పాతపేలికలు దీనికే సరిపోతే ఆ సందిట్లోనే కొంపలు మునిగినట్లు కోడాలు కనింది. నేనూ ఆడదాన్నే బాబూ! అయినా నా కండ్లతో నేను సూడలేదు. ఇల్లంతా రగతమయం. ఒకటీ అర పాత పేలిక లేమూలకని? కొడుకేఁవో లారీమిందెల్లి వారఁవయింది. వాడు

రాలా. అదేఁవో కని కూసునింది. ఏంజెయ్యడానికి కాలాడలేదు. పచ్చి ఒంటితో దాన్నట్ల తడినేలమిందొదిలిపెట్టి బాలాజీ కాలనీకి పరిగెత్తితి. కనిపించిన తల్లికంతా సెయ్యెత్తి మొక్కితి. సాటి ఆడదాని సంగతి యివరిస్తి. ఆదుకోమని కంట తడిబెడితి. ఆ బాలాజీ కాలనీలో వుండేవన్నీ పెద్దపెద్ద యిండ్లే బాబూ! ఆ పెద్దపెద్ద యిండ్లల్లో పెద్ద పెద్దోళ్ళే వుండారు. పెద్దపెద్దోళ్ళు పెద్ద పెద్ద మాటలే అన్నారు. 'పాత పేలికలకే నోసుకోలేని ఆడది మొగుడి పక్కలో పడుకోకపోతేనేం?' అని ఒక తల్లి మూతి మూడొంకర్లు తిప్పింది. 'కంట్లో దీపం పెట్టుకోనొచ్చావే? — రేపు రాబో సూద్దాం?.... కనింది!..సచ్చింది!..అడక్కతినే బతుకులకు అరవై నాలుగు కుంటిసాకులు!' అని ఒక తల్లి గొణిగింది. ఒకింట్లో అత్తసాటు కోడాలు సాటుమాటుగా పాతసీర తెచ్చిస్తావుంటే ఆ యింట్లో కుక్క నామిందెగిరిపడినట్టు అత్త ఆ కోడాలి మిందెగిరిపడింది. జావురేత్తిరిదాకా తిరిగి తిరిగి సావుజంపులయినా నాలుగు పాతపేలికలకు నోసుకోలేకపోతి బాబూ!"—ఆ ముసలిదాని గొంతు పూడుకపోయింది. తోలు తిత్తిలాంటి ఒంటిలో గాలి తుస్సుబోయినట్లుంది. మాటలు రాలేదు. కాసేపు మౌనం వహించింది. రావు ఈ లోకంలో వున్నట్లు తోచడంలేదు. మూర్తి ఈ లోకంలోనే వున్నా తన గతిని గురించి తన లోకంలో తానున్నాడు.

"జాఁవురేత్తిరి దాటింది. గాంధీరోడ్లో పడి నడుస్తున్నా. ఈదినిండా కరెంటు దీపాల ఎలుగులే! ఆ కరెంటు దీపాల సుట్టూ పురుగులు. అయితే రోడ్డుమింద పురుగులేదు. కాళ్ళు పీకతావుండె. ఇంట్లో కసుగందును తల్చుకుంటే కడుపులో సెయ్యేసి దేవినట్టయింది. ఏఁవీ తోసక నడుస్తూంటే గంగుడు మండపంసందులో పాత గుడ్డల మూటలు గుట్టలు గుట్టలుగా పడివుండె. ఆడొకడు గురకబెట్టి నిద్రబోతా వుండె. నాకేఁవీ తోసలేదు. నాక్కావాల్సింది నాలుగు పాతపేలికలు. అట్టాయిట్టా సూసినా. అమాంతంగా ఆ గుట్టలో ఒక మూట గుంజుకున్నా. పరుగందుకున్నా. పోలీసోళ్ళ సేతిలో

పడినా. రాతిరంతా సావుదెబ్బలు తిన్నా. ఇంతే బాబూ! యిదే నేను సేసిన దొంగతనం!....నేను సచ్చినా ఫరవాలేదు. నా కోడలు....నా మనవఁడు బాబూ." కుప్పగ కూలిపోయింది ముసలిది!

"సారధీ!" రావ్ పిలిచాడు.

కారు డ్రైవరు సారథి అడుగులో వచ్చి ఆయన ముందు నిలబడ్డాడు.

"ఈమెను కార్లో కూర్చోబెట్టు!"

"అయ్య!"

"బంగళాకు వెళ్ళు!"

"అయ్య!"

"అమ్మనడిగి నాలుగు పాత చీరలు తీసి యివ్వు!"

"అయ్య!"

"ఆ తరువాత ఆ ముసలావిడనడిగి యిల్లెక్కడో తెలుసుకొని యింటి వద్ద దిగబెట్టు."

"అయ్య!"

"చెప్పిందంతా అర్థమయిందా?"

"అయ్య!"

అర్థమయిందానికి నిదర్శనంగా సారధి ఆ ముసలిదాన్ని 'లే అవ్వా!' అన్నాడు.

ఆ ముసలిది రావ్ రెండు కాళ్ళను వడిసి పట్టుకొనింది. "నన్ను రచ్చించారు. నీ కడుపున పుడతాను బాబూ!" అంటూ కాళ్ళకు మొక్కిందీ.

కిలకిలా నవ్వాయి నీతి నిజాయితీ దయ దాక్షిణ్యము!

దయాదాక్షిణ్యాలకు కాళ్ళు వచ్చాయి. గునగున నడిచాయి. ఎగిరి మూర్తి భుజాలమీద చెరొక ప్రక్కగా కూర్చున్నాయి. చెవులు పిండాయి. కిక్కురుమనలేదు మూర్తి! నీతికి కాళ్ళు వచ్చింది. నిక్కుతూ నీల్గుతూ దర్జాగా నడిచింది. ఆ స్టేషను రైటరు పాపాల భైరవుడు. లంచాలన్నీ అతని చేతుల మీదుగానే వసూలు. నిక్కరు జేబులు చొక్కా జేబులు చాలక అదనంగా జేబులు ఆర్డరిచ్చి కుట్టించుకొంటాడు. వసూలుకు ఖర్చుకు ఒక పద్ధతి అంటూ వుండదు. కాబట్టి అతని కండ్లు ఎప్పుడూ నెత్తిమీదనే వుంటాయి. ఆ రైటరు ముందు హుందాగా నిలబడింది నీతి. 'ఎవరు నువ్వు?' అని ముక్కులు ఎగురవేశాడు రైటరు. ముక్కును వడిసి పట్టుకొనింది నీతి. రసం తీయడానికి నిమ్మకాయను నలిపినట్లు నలిపింది. నోరు కదపలేదు రైటరు.

నిజాయితీకి కాళ్ళు వచ్చింది. నీట్‌గా నడిచింది. సెంట్రీ ముందు నిలబడింది. చెప్పకుండా చెందకుండా తుపాకిని లాక్కొనింది. గుడ్లురిమాడు సెంట్రీ. పొడుస్తానని తుపాకిని పైకెత్తింది నిజాయితీ!—మిడిగుడ్లు పెట్టాడు సెంట్రీ! మరొక్కసారి మనసారా నవ్వుకొన్నాయి నీతి నిజాయితీ దయాదాక్షిణ్యాలు! సారథి ముందు, ముసలిది వెనుకగా స్టేషను నుండి బయటికి నడిచారు. రావు కుర్చీలో కూలబడ్డాడు. కాళ్ళు బారసాచాడు. కుర్చీమీద వాలిపోయాడు. అప్రయత్నంగా అతని కండ్లు నిండితే - కనురెప్పలు మూసి పెట్టాయి!

అర్ధగంట దాదాపుగా గడచింది. స్టేషను వాతావరణంలో మార్పు లేదు. ఈ లోపుగా డియస్పీగారి కారు వచ్చి స్టేషను ముందాగింది! కారు ఆగిన చప్పుడుతో స్టేషను మేలుకొనింది. రావు లేచాడు. మౌనంగా మహాయోగిలా నడుస్తూ కారులో కూర్చున్నాడు. కారు కదలిపోయింది.

మూర్తి కుర్చీలో కూలబడ్డాడు. దెబ్బతిన్న కోడి మెడలా తల వాలిపోయింది. వాలిన తలను రెండు చేతులలో వత్తి పట్టుకొన్నాడు. నీతి

నిజాయితీ దయాదాక్షిణ్యము కిక్కురు మనకుండా మళ్ళీ యింటి పై కప్పు మీదికెక్కి కూర్చున్నాయి.

మూర్తి తలనిండుకు ఆలోచనలు. తుట్టెను చుట్టిన కందిరీగల్లా మెదడును తొలుస్తున్నాయి. ఎటెటో తిరుగుతున్నాయి. తిరిగి తిరిగి తల తిరిగి నోటివద్దకు వచ్చినట్లుగా ఆరంభమైన చోటనే వచ్చి ఆగుతున్నాయి. అసలు ఆలోచనలు ఆరంభం కావడానికి కారణం ముసలిది. ఎవరీ ముసల్ది? దొరగారికీ దీనికీ సంబంధమేమిటీ? దొంగముండను దొరసానిలాగ కార్లో సాగనంపాడే! ఒకవేళ దొరగారికి ముసలిదేమైనా దూరపు బంధువా? ఉండడానికి వీల్లేదే?—ఆలోచనలు అనికి రాలేదు. ఆరాతీయడానికి పోలీసు పుర్రె పనికిరాలేదు.

మూర్తి ఆ స్టేషను సామ్రాజ్యములో రారాజయితే ఆ స్టేషనులోని పాతకాలపు కొయ్యకుర్చీ సర్వాధికార మణిమయరత్న ఖచిత సింహాసనము. ఆ సింహాసనములో సావకాశంగా కూర్చుని సిగరెట్టు పొగవలయాలు సృష్టిస్తే—ఆ వలయాలు అలలై—బంగారు కలలై వచ్చినవారి పాలిటికి వలలైతే మూర్తి అటు యిటు కదిలేవాడు కాదు. కానీ ఈనాడా సింహాసనము ముళ్ళకంపలా తయారైంది. కంపమీద కూర్చోడానికి కంపరమెత్తుతూ వుంది. మూర్తి పైకి లేచాడు. నిశ్శబ్దం నిండు సభ చేస్తున్న పోలీసు స్టేషనులో తల వంచాడు. వంచిన తల ఎత్తకుండా బయటపడ్డాడు.

నడుస్తూ ఆలోచిస్తున్నాడు మూర్తి. అసలు పోలీసు బుద్ధులకు రంధ్రాన్వేషణ అంటే మహారంజు. అటునుంచి కాకపోతే యిటు, ఇటునుంచి కాకపోతే అటు ఎటో యీదులాడి తేలవలసిన చోట తేలడమంటే మహా సరదా పోలీసు పుర్రెలకు. కానీ మూర్తి ఆలోచనలన్నీ గారమీద పడిన పూసల్లా చెల్లాచెదరవుతున్నాయి.

ఇల్లుచేరాడు మూర్తి. ముసుగుదన్ని అలిగిన ఆడదానిలా ఓ గదిలో ఏకాంతంగా పడుకొన్నాడు. ఆ పూట సతీమణి వంటకాలు రుచించలేదు.

సపర్యలు సేదదీర్చలేదు. పిల్లల ముచ్చట్లు యిచ్చగించలేదు! దొరగారిని యెలా చూడాలి? చూచినా యేమని సంజాయిషీ యిచ్చుకోవాలి?

పోనీ! ఏమంత కొంపలు మునిగాయని సంజాయిషీ!

మూర్తి ఆలోచనలతో సతమతమవుతున్నాడు.

కాలం! చాలా చిత్రమయింది. కొలతకు లోబడింది. కోర్కెలకు పైబడింది. ముహూర్తాలకు కట్టుబడింది. అయితే ఆగమంటే మాత్రం ఆగదు. అందుకే యెవరితో నిమిత్తం లేకుండా తనపని తనదన్నట్లుగా సాగింది. సాయంకాలమయింది.

మూర్తి యింటినుండి బయలుదేరాడు. దొరగారిని బంగళాలో చూడాలని బయలుదేరాడు. ఆ సాయంకాలంపూట మహాసందడిగా వున్నాయి వీధులన్నీ. అడ్డదిడ్డంగా నడుస్తున్న జనం....ఆ జనాన్ని తప్పించుకోలేక అవస్థపడుతున్న రిక్షాలు, సైకిళ్ళు—అంతా గందరగోళంగా మూర్తి బుర్రలా వుంది. మరొకప్పుడయితే చేతికర్రకు చెప్పలేనంత పని. కానీ ఈనాడతని కంటికంతా శూన్యంగా కనిపిస్తూవుంది.

మూర్తి దొరగారి బంగళాను సమీపించేసరికి కనుచీకటి ఆవరించింది. పై అధికారి దర్శనంతో తలలు వాలినట్లు విద్యుద్దీపాల ముందు కనుచీకటి తలవంచింది. రావు తలవంచి చేతులు వెనక్కికట్టి, పచార్లు చేస్తున్నాడు బంగళా ముందు తోటలో! దొరగారి ధోరణి చూసి గతుక్కుమన్నాడు మూర్తి!

సాధారణంగా అలాంటి సమయాల్లో కూడా ఫైళ్ళల్లో తలదూర్చి తల బ్రద్దలు కొట్టుకొనే మనిషి తోటలో పచార్లు చేస్తున్నాడంటే—ఇంకనూ ముసలిదాని ఆలోచనల ముసురు వదల్లేదన్నమాట! లేకుంటే ఈ వింత ధోరణికి కారణముండదు. "దేవుడా! నువ్వే దిక్కు?" అని ఉత్తరంగా మళ్ళి దేదీప్యమానంగా వెలుగుతున్న తిరుమల కొండ కాలిబాటమీది విద్యుద్దీ

పాల తోరణానికి మొక్కాడు మనస్సులోనే! అడుగుమీద అడుగుగా బంగళాలో అడుగుపెట్టాడు.

"రా మూర్తీ! రా!!" సాదరంగా ఆహ్వానించాడు రావు.

రావు ముందు, మూర్తి వెనుకగా ఆ తోటలో కొంతదూరం నడిచారు. అక్కడ అందంగా కట్టిన ఓ అరుగు. ఆ అరుగుచుట్టూ అందాల పూల మొక్కలు విద్యుత్కాంతులతో వింతగా మెరుస్తున్నాయి. పిల్ల గాలులతో మెల్లగా ఊగుతున్నాయి ఆ పోలీసు అధికారుల పుర్రెలు ఊగిసలాడినట్లు!

"కూర్చో మూర్తీ!" అంటూ కూర్చుంటూ మూర్తిని కూర్చోమన్నాడు రావు.

ఒదిగి ఆ అరుగుమీద ఓరగా కూర్చున్నాడు మూర్తి.

"మూర్తీ! నాకు తెలుసు నువ్వు వస్తావని. నేను గ్రహించాను నువ్వు సతమతమవుతున్నావని!"

మూర్తి వినయంగా దొరగారి వైపు చూశాడు.

"మూర్తీ! ఈ లోకంలో ప్రతివ్యక్తీ నేరస్థుడే! ఎప్పుడో ఒకప్పుడు యేదో విధంగా తెలిసీ తెలియక నేరం చేస్తూనేవుంటాడు. నేరానికి తగిన శిక్ష విధించకపోవడం అన్యాయం. అయితే వచ్చే చిక్కంతా నేర నిర్ణయంలోనే!"

క్షణంసేపు ఆగాడు రావు!

ఆరంభమే అయోమయంగా వుంది. ఆదిలోనే హంస పాది. ఇక పరిణామం యెలా వుంటుందో? ఒకవేళ తాను నేరనిర్ణయంలో తప్పటడుగు వేసినట్లు దొరగారు ఆరోపించనున్నారా? ఇరకాటంలోపడి అటు యిటు కదలలేకపోతున్నాడు మూర్తి.

"మూర్తీ! ఉత్తరదేశములో అది ఒక పెద్దపట్టణము. అందమైన పట్టణము. అందమైన పట్టణానికి అందాలుదిద్దుతూ అందులో ఒక భవనము. రాజభవనము లాంటి భవనము. ఆ రాజభవనములో రాజులాంటి మనిషి. అతడొక మహామనీషి. అతని మాట ఆజ్ఞ. అతనిరాత శాసనము. అంతటి మహామనీషికి అంతకుమించిన సతీమణి! ఆమె ఒక విదుషీమణి!"

మూర్తి అయోమయంగా వింటున్నాడు. రావు చెబుతున్నాడు.

"మూర్తీ! ఉత్తరదేశ చరిత్రను విన్నావుగదా! ఇక దక్షిణదేశాన్ని గురించి విను. దక్షిణదేశములో అది ఒక చిన్నపట్టణము. ఆ చిన్నపట్టణములో ఓ పెద్ద దేవాలయము. ఆ పెద్ద దేవాలయములో అంతకంటే పెద్ద దేవుడు. ఆయన త్రిమూర్తులలో ఒక్కడు!"

మూర్తి ఆశ్చర్యం ముడిపడుతూవుంది:

"దక్షిణదేశములోని ఈ దేవుడిపైన ఉత్తరదేశములోని మహామనీషి సతీమణి అయిన విదుషీమణికి భక్తిభావం పొంగిపొరలింది. 'అగ్గిపుల్ల, సబ్బుబిళ్ళ కుక్కపిల్ల' కాదేదీ కవిత కనర్హం అన్నాడుకదా ఓ మహాకవి. మరి దేవుడే కవితావస్తువైనపుడు యిక కవిత్వం సంగతి చెప్పాలా? కలం పట్టిన ప్రతిమనిషి కవినని రొమ్ము విరుచుకు తిరుగుతున్న ఈ దేశములో మహామనిషి సతీమణిగారి సంగతి ఆలోచించాలా? ప్రముఖ పత్రికలే బ్రహ్మరథం పట్టాయి ఆ కవిత్వానికి!"

"ఎవరబ్బా ఈ విదుషీమణి?" అని ఆలోచిస్తున్నాడు మూర్తి. రంధ్రాన్వేషణలో కాకలుతీరిన పోలీసు బుఱ్ఱ సాహితీపరంగా చవటబారింది. చివరికతనికి మిగిలింది ఆలోచన మాత్రమే!

"అంతవరకు బాగుంది మూర్తీ! కవి నిరంకుశుడు. అతనికిష్టమొచ్చినట్లు రాసుకోవచ్చు. అతని కలము. అతని భావన. నచ్చినవాళ్ళు మెచ్చు

కథా నిలయం 3756 శ్రీకాకుళం

కుంటారు. నచ్చనివాళ్ళగతి దేవుడెరుగు. అయితే ఆ మహామనీషి సతీమణి తన కవితామృతాన్ని దక్షిణదేశములోని దేవుడికి స్వయంగా దోసిళ్ళతో త్రాగించాలని సంకల్పించింది. సతిగా తన సంకల్పాన్ని పతిదేవుడి చెవిలో ఊదింది! మూర్తీ! ప్రతిసతికి ఓ పతి వుంటాడు. ప్రతిపతికి ఓ సతి వుంటుంది. ప్రతిసతికి సవాలక్ష సంకల్పాలుంటాయి. అయితే పెద్దపెద్ద సతుల సంకల్పబలం చాలాబలంగా వుంటుంది. అందుకే ఉత్తరదేశం కదిలింది. దక్షిణదేశం చేతులెత్తి హృదయపూర్వకమైన ఆహ్వానం పలికింది."

అది కల్పిత కథనా? లేక వాస్తవమా? అర్థం కాకుండా అయోమయంలో పడ్డాడు మూర్తి!

"దక్షిణదేశం చేతులెత్తి ఆహ్వానం పలుకుతూంటే ఆ చిన్నపట్టణములోని పెద్దదేవాలయములో బూజు దులిపారు. వెల్లవేయించారు. రంగులు పూయించారు. రంగు రంగుల విద్యుద్దీపాలతో అలంకరణలు చేశారు. అదంతా చూచి అంతకాలానికైనా తన్ను గమనించినందుకు కారణభూతురాలైన ఆ విదుషీమణికి కృతజ్ఞతలు తెలపడానికి కాచుకూర్చున్నాడు దేవుడు!

ఎదురు చూచిన అమృతఘడియ రానే వచ్చింది.

ఆ ఆలయంలో అందమైన పందిరి. పందిరిక్రింద వేదిక. వేదికమీద మెత్తని పరుపులు. వేదికముందు శబ్దప్రసారక యంత్రము! ఆలయంనిండా అధికారులు.... అనధికారులు.... పురప్రముఖులు.... కాదనలేక వచ్చిన కవిత్వ విముఖులు. కవితాగానం ఆరంభమయింది. విదుషీమణి మెత్తని పరుపుమీద సుఖాసీనురాలయింది. గొంతెత్తి కవితాగానం చేస్తూఉంది.

ఇసుకవేస్తే రాలనంత జనం యిష్టమున్నా లేకున్నా విధిగా కూర్చుని వింటున్నారు. నిమిత్తమాత్రులైన ప్రజలలో ప్రజాభిప్రాయంతో పట్టింపు

లేకుండా ఆ మహామనీషి సతీమణి అరమోడ్పు కన్నులతో భక్తి పార వశ్యంతో కవితాగానం చేస్తూవుంది. నిరాఘాటంగా నీటివాటంగా కవితా గానం సాగిపోతూ వుంది!

దేవుడికి నోరు చెవులు కూడా లేవు కాబట్టి భరిస్తున్నాడు. అధికారా నికి భయపడి కొందరా శిక్ష అనుభవిస్తున్నారు.

ఉన్నట్లుండి కవితాగానం ఆగిపోయింది ఓ క్షణం!

అందరిదృష్టి వేదికవైపు మళ్ళితే వేదికమీది విదుషీమణి దృష్టి ఆ సభలో నుండి పైకిలేచిన ఓ నారీమణివైపు వెళ్ళింది. ఆ నారీమణి నిజంగా మణిలాగానే వుంది. ఆమె కట్టినచీర ఆమెకంటే అందంగా వుంది. ఆమెతో చీరకందమా? చీరతో ఆమెకందమా? అన్నంత అందంగా వున్నారు ఆమె! ఆమెకట్టిన చీర!

విదుషీమణి పెదవులపై ఓ చిరునవ్వు విరబూసింది!

ఆ నారీమణి సభనుండి పైకిలేవడం అనుచితంగా భావించి కవితా గానం ఆగడానికి అది కారణంగా యోచించి అధికారవర్గము ఆమెమీద విరు చుకపడింది. 'పడితే లేవవలసింది పడినవాళ్ళే గదా! మధ్య నాకేం?' అన్నంత ధీమాతో ఆ నారీమణి సభనుండి విసవిసనడిచిపోయింది. పోతున్న నారీ మణిని విదుషీమణి కన్నార్పకుండా చూచింది.

ఆమె పెదవులపై మళ్ళీ ఓ చిరునవ్వు వెలిసింది!

ఆ తరువాత ఆ విదుషీమణి ఏమనుకొనిందో యేమో? చిరునవ్వుతో తల పంకిస్తూ పక్కనున్న పతిదేవుని చెవిలో యేమో వూదింది. ఆ మహా మనీషి కూడా చిరునవ్వుతో తల పంకించి అంగరక్షకుల్లాగ అక్కడే నిల బడివున్న ఒకానొక అధికారి చెవిలో యేమో వూదాడు. ఆ అధికారి కలె క్టరుగారి చెవి కొరికాడు. కలెక్టరు డి.ఆర్.ఓ చెవిలో చెవిపెట్టి యేమో చెప్పాడు. డి.ఆర్.ఓ., ఆర్.డి.ఓ. చెవిలో గుసగుస చెప్పాడు. ,ఆర్.డి.ఓ.

తహసిల్‌దారు చెవికొరికాడు. తహసిల్‌దార్ రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ ఎగిరి జీపులో పడ్డారు. జీపు రొప్పుతూ రోజుతూ దుమ్ము లేపుకొంటూ పరుగెత్తింది.

కవితాగానం సాగినంత వరకు సాగి ఆగింది. ఉచ్చులు తెంపుకొన్నట్లుగ జనంలేచారు. జనం లేస్తూవుంటే విదుషీమణి కృతజ్ఞతలు పలికింది. ఆ తరువాత వేదిక దిగింది. దేవుడి సన్నిధానములో నిలబడింది, నిమీలిత నేత్రాలతో! పూజారి వినయవిధేయతలతో దేవుడు సంతోషించినట్లు తోచింది!—

ఆ తరువాత ఆమె కారుదగ్గరికి బయలుదేరింది. ఆమె కారును సమీపిస్తున్న సమయానికి జీపు ఆమె ముందర ఆగింది. ఆగిన జీపులో నుండి రెవిన్యూ ఇన్‌స్పెక్టరు యెగిరి దూకినంత పనిచేశాడు. దూకి ఓ మూటను క్రిందికి దించాడు. ఆ మూటనిండా కండ్లు మిరిమిట్లు గొలిపే చీరలు! యాభై చీరలు! అన్నీ వెంకటగిరి పట్టుచీరలు!

"ఇది వంద, ఇదో ఇది రెండువందలా యాభై. ఇది మూడు వందలు....యిలా వరుసగా యాభై —చీరలరేట్లు వివరించాడు రెవిన్యూ ఇన్‌స్పెక్టర్. అంతా వినింది. అటుపై తలపంకిస్తూ ఓ చిరునవ్వు నవ్వింది విదుషీమణి!

అర్థమయిందన్నట్లుగా అంగరక్షకుడిలాంటి అధికారి ఆ మూటను జాగ్రత్తగా కట్టి అంతకంటే జాగ్రత్తగా కారు డిక్కీలో భద్రపరచినాడు. డిక్కీని జాగ్రత్తగా వేస్తున్నారో లేదో అని ఓరగంట గమనిస్తూ అమ్మగారు కార్లో కూర్చున్నారు. అమ్మగారి ప్రక్కన మహామనీషి అయ్యగారు కూర్చున్నారు. అందరికీ కలిపి ఒక్కసారిగా నమస్కరించారు. అందరూ కలిసి నమస్కరిస్తుంటే ఆమె చిరునవ్వు నవ్వింది. కారు కదిలిపోయింది!"

గుక్క తిప్పుకోవడానికన్నట్లుగా రావు ఒక్కక్షణం ఆగాడు. మూర్తి ఆశ్చర్యంగా వింటున్నాడు.

"మూర్తీ! బందోబస్తుకు వెళ్ళిన పోలీసు అధికారులలో నేనూ ఒక్కణ్ని!"

"నిజమా!" అన్నట్లు మూర్తి నోరు తెరిచాడు.

"గద్ద తన్నుకుపోయినట్లు ఆ పట్టుచీరల మూటను ఆ విదుషీమణి తన్నుకపోయేసరికి ఆ హంగామా నిర్వహించడానికి నడుంకట్టిన అధికారుల నడుములు విరిగాయి. నిట్టూర్చారు. నిస్సహాయంగా నిలబడ్డారు. నిస్సహాయంగా నిలబడ్డ అధికారులకు వున్నట్లుండి కారాల్లోకెల్ల అధికారం గొప్పదన్న ఆలోచన తట్టింది. తట్టడమే తరువాయి. అధికార రాబందులు రెక్కలు విప్పుకున్నాయి. అడ్డదారినపడ్డాయి. అడ్డుపడిన వారినంతా అడ్డదిడ్డంగా పొడిచి పొడిచి పీక్కుతిన్నాయి. ఇంతచేసినా చేయగలిగిందంతా ఒక్క చిరునవ్వుకు వెలగట్టడం!

ఆ చిరునవ్వు వెల ఆరువేలకు పైబడి.

కాలే కడుపులు....ఉరిసే గుడిసెలు....ఆ గుడిసెలు ఉరిసి ఉరిసి తడిసిన నేల....ఆ తడి నేలమీద పచ్చిబాలింతరాలు!....ఆ బాలింతరాలి ప్రక్కన పురిటికూన....నెత్తుటిలో దోగాడుతున్న పురిటికూన....వాళ్ళకు కావలసింది నాలుగు పాతపేలికలు! ...

ఆ పాత పేలికలకోసం ఓ పేదరాలు కన్నతిప్పలు పడింది!

పట్టపగలు పదిమంది అధికారుల ముందు పట్టుచీరలు ఓ విదుషీమణి దర్జాగా పట్టుకపోయింది!

ఏది నేరం? ఎక్కడున్నది నేరానికి తగిన శిక్ష??

ఆలోచించు మూర్తీ! ఆలోచించు."

రావు పైకిలేచాడు. అతడు లేస్తుంటే మూర్తి కూడా లేచాడు.

ఒక్క క్షణం చూపుల్లో చూపులుబెట్టి రావు మూర్తిని చూశాడు. రావుగారి కనుకొలకుల్లో రాలడానికి సిద్ధంగా కన్నీళ్ళు!—

అవి కన్నీళ్ళుగావు — న్యాయాన్యాయాల్ని ప్రక్షాళన చేయడానికి స్రవించనున్న పవిత్రమైన నీళ్ళు!

మౌనంగా మహాయోగిలా రావు బంగళావైపు నడిచాడు!

మూర్తి తలవంచాడు!

(ఇందులో పాత్రలు, సంఘటనలు కేవలం కల్పితాలు. ఎవరినీ ఉద్దేశించినవి కావు.)

ఏప్రిల్ 1978, ఆంధ్రభూమి